వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న సిరిపురం యాదయ్య విగ్రహాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు వద్ద ఏర్పాటు చేయాలని సిరిపురం యాదయ్య స్మారక సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గద్దర్ అవార్డులు పెట్టి తెలంగాణ పాటలను గౌరవించి అందెశ్రీ రాసిన గీతాన్ని అధికారిక గీతంలో ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం యాదయ్య చేసిన త్యాగాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన విగ్రహాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు ముందు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈనెల 20న జరిగే అమరుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సభ పోస్టర్‌ను స్మారక సమితి ఆధ్వర్యంలో శనివారం విద్యానగర్ బీసీభవన్ వద్ద తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ సంఘాల నాయకులు, స్మారక సమితి చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరాజయ్యలతో కలిసి ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల 20న యాదయ్య ఆత్మబలిదానం ఎక్కడైతే చేసుకున్నాడో అక్కడ ఆయన వర్ధంతి సభను ఈనెల 20న భారీ బహిరంగ సభలో నిర్వహిస్తున్నామన్నారు. మలిదశ తెలంగాణ పోరాట విద్యార్థి ఉద్యమకారులు, అమరులను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. 20న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో యాదయ్యకు ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. స్మారక సమితి ప్రతినిధులు పుట్టా పాండురంగయ్య, వీరమల్లు యాదవ్, కైలాష్‌నాగేష్, రాజునేత, జంపాల రాజేష్, దుర్గా గోవర్ధన్, బాలకృష్ణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో అమోలిక సిల్క్ షోరూం

ముషీరాబాద్: వస్త్ర వ్యాపారంలో పేరొందిన అమోలిక సిల్క్ తన రెండో బ్రాంచ్ రాంనగర్‌లోని టీఆర్‌టీ కాలనీలో శ్రీనివాస బట్టల దుకాణం లైన్‌లో ప్రారంభించారు. షోరూమ్ యజమాని సీ.హెచ్. శ్రీకాంత్, నేష్‌లు మాట్లాడుతూ.. కంచిపట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు, పట్టుపావడాలు తమ షోరూమ్ ప్రత్యేకం అని రూ.299 నుంచి రూ.లక్ష వరకు చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఎస్‌టీ కార్మిక స్కూల్ విద్యార్థులకు బూట్ల పంపిణీ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాజీ సీఎం కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా వీఎస్‌టీ కార్మిక విభాగం స్కూల్‌లో సుమారు 120 మంది విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం కేసీఆర్ చేసిన కృషి చిరస్థాయిలో నిలిచిపోతాయని కొనియాడారు. ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 10 వేల బహుమతులను ప్రదానం చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వీఎస్‌టీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఆఫీస్ బేరర్స్ నరేందర్‌గౌడ్, రణధీర్‌రెడ్డి, రవియాదవ్, శంకర్, మల్లేష్, అతిక్, మధు, సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు మల్లేష్, సిరిగిరి శ్యామ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తంద్రి పెరియార్ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పసునూరి రవీందర్, బైరి నరేష్ తదితరులు

కవాడిగూడ: పీడిత ప్రజల స్వేచ్ఛకోసం అవిశ్రాంతంగా తన జీవితాంతం పోరాటం చేసిన వ్యక్తి పెరియార్ రామస్వామి అని పలువురు వక్తలు కొనియాడారు. గద్దర్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో భాగంగా రవ్వా శ్రీహరి వేదికపై తంద్రి పెరియార్ పుస్తకావిష్కరణ సభ సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య యువ పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, నాస్తిక సంఘం అధ్యక్షుడు బైరి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్రావిడ ఉద్యమాలకు పాదులు వేసిన పెరియార్ రామస్వామి గురించి ఆధునిక సమాజానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. జగదీష్, ప్రొఫెసర్ భూక్యా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని వినతి



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో డ్రైనేజీ లీకై మురుగు తాగునీటి పైపులైన్‌లో కలవడంతో కలుషిత నీరు సరఫరా అవుతుందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అంబేడ్కర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు ఎర్రం శేఖర్ నారాయణగూడ డివిజన్-5 జనరల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు 2000 మంది దళిత ప్రజలు నివసిస్తున్నారని 25 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితమవుతుందన్నారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యాల భారినపడుతున్నారని తెలిపారు. వెంటనే 1-7-1022/91 నుంచి 1-7-1022/9/50 వరకు పాత పైపులైన్లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.

క్రైస్తవులపై దాడులు సరికాదు

చిక్కడపల్లి: క్రైస్తవులపై దాడులు చేయడం హేయమైన చర్య అని హెబ్రోను సొసైటీ సభ్యులు అన్నారు. జన్వాడలో జరిగిన ఘటనను వారు ఈ సందర్భంగా ఖండించారు. గోల్కొండ హెబ్రోన్ చర్చిలో శనివారం సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి మాట్లాడారు. ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన వారిని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

చిక్కడపల్లి: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గాంధీనగర్ పోలీసులు తెలిపారు. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లం అనిరుధ్(21) తుకారంగేట్, ఎస్.బాబు అక్షయ్(24) మల్కాజిగిరికి చెందిన వారు వీరిద్దరు ఈనెల 14న సాయంత్రం 4.30 గంటల సమయంలో కవాడిగూడలోని సీజీఓ టవర్స్ మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. ఓ వ్యక్తి దగ్గర పర్సు లాక్కొని మరోకరికి చేరవేశారన్నారు. శనివారం ఉదయం బన్సీలాల్‌పేట్ కమాన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నిందితులు పట్టుపడటంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.

‘సాంస్కృతిక సారథి’ బిరుదు హర్షణీయం



బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎంపీ సురేష్ షెట్టర్, రాష్ట్ర వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ వీరమల్లేష్ తదితరులు

కవాడిగూడ: తమ ఆరాధ్యదైవమైన బసవేశ్వరుడికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ.. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం బసవేశ్వరుడికి సాంస్కృతిక సారధి బిరుదును ప్రదానం చేయడం, మంత్రి వర్గ తీర్మాణం చేయడం అభినందయనీమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కర్ణాటకలో ఉన్న వీరశైవ లింగాయత్ కులస్తులకు న్యాయం చేసేందుకు అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కర్ణాటకలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గం తీర్మాణంలో బసవేశ్వరుడికి అధిక ప్రాధాన్యతను కల్పిస్తూ.. సాంస్కృతిక సారధిగా బిరుదు ఇవ్వడంపై శనివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న బసవేశ్వరుడి విగ్రహం వద్ద తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ సికింద్రాబాద్ అధ్యక్షుడు మాడపు వీరమల్లేష్, ప్రధాన కార్యదర్శి కోట గుండప్ప, వీరశైవ సేవాదళ్, లింగాయత్ మహాసభ యువ రాష్ట్రీయ బసవదళ్, సమస్త లింగాయత్ సమాజ్ సంయుక్తాధ్వర్యంలో అభినందన సభ, సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎంపీ సురేష్ షట్టర్, తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ మాడపు వీరమల్లేష్, నాయకులు బద్రి ఈశ్వరప్ప తదితరులు పాల్గొని సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం బసవేశ్వరుడికి సాంస్కృతిక నాయకుడిగా బిరుదు ఇవ్వడం చాలా అభినందనీయమన్నారు. ఆ ప్రభుత్వానికి వీరశైవ లింగాయత్‌లు అందరూ రుణపడి ఉంటారని కొనియాడారు. వీరశైవలింగాయత్‌లు బసవేశ్వరుడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే సంస్కారం మెరుగు

హరియాణా గవర్నర్ దత్తాత్రేయ



మాట్లాడుతున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

కవాడిగూడ: పుస్తక పఠనంతో సంస్కారం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ పుస్తకాలతో తమ జీవితాన్ని మేళవించుకుని చదవాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. ప్రస్తుతం నడుస్తున్న డిజిటల్ ప్రపంచంలో తల్లిదండ్రులు పిల్లలు పుస్తక పఠనం చేసేలా ప్రోత్సహించాలన్నారు. జీవితకాలం పాటు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతీయువకులు పరిజ్ఞానాన్ని మరింత పెంచుకోవాలన్నారు. విజ్ఞానవంతులతోనే సమాజ హితం జరుగుతుందన్నారు. తాను ప్రతిరోజు రాత్రి 9గంటల నుంచి 11గంటల వరకు పుస్తక పఠనం చేస్తానని ప్రయాణ సమయంలో కూడా పుస్తకాలు చదువుతానని పేర్కొన్నారు. 36వ జాతీయ పుస్తక ప్రదర్శన విజయవంతం కావాలని కోరుకుంటున్నానన్నారు. కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నాయకులు ప్రభాకర్, కేశవరాజు, రమేష్ తదితరులున్నారు.

బహుజన సాహిత్యం విడుదల



సాహిత్యాన్ని విడుదల చేస్తున్న దేవేందర్‌గౌడ్

కవాడిగూడ: బహుజన సాహిత్యాన్ని విస్తృతం చేసే కార్యక్రమాన్ని ప్రొఫెసర్లు, అధ్యాపకులు, టీచర్లు, బహుజన మేధావులు చేపట్టాలని రాజ్యసభ మాజీ ఎంపీ, బీసీసీఈ చైర్మన్ తూళ్ల దేవేందర్‌గౌడ్ కోరారు. గద్దర్ ప్రాంగణంలోని రవ్వాశ్రీహరి వేదికపై బీసీసీఈ ఇన్‌చార్జి ఇంద్రవెల్లి రమేష్ నిర్వహణలో 14బహుజన పుస్తకాలను ఆవిష్కరించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సింహాద్రి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీమనోహర్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు బంగ్యా, భూక్యా, ప్రొఫెసర్ వెంకటేష్, దళిత నాయకులు జేబీ రాజు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బీసీ ఉద్యమ నేత సమ్మయ్య, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మానవతా దృక్పదంతో కార్పొరేట్ వైద్య సంస్థలు పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్ మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కామినేని ఆస్పత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివముదిరాజ్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి, దంత, గుండె పరీక్షలు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు 350 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లాభాపేక్షతో కాకుండా ప్రైవేటు వైద్య సంస్థలు ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ నీరజమోహిత్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ హైజాక్, జనరల్ సర్జన్ డా.సుకుమార్, ఆర్థోపెటిక్ డా.ప్రేమ్‌కుమార్, డా.తబసోం, నస్రీన్, కామినేని ఆస్పత్రి ప్రతినిధి ఆనంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, భాస్కర్‌నేత, అనిల్, అరుణ్, నవీన్, శివ, సత్యనారాయణ, బాబు, శ్రీనివాస్, మురళీధర్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

ముషీరాబాద్: మాదిగల హక్కుల కోసం ఇంతకైనా కొట్లాడతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగ జాతి హక్కుల కోసం ఎంతకైనా కొట్లాడి సాధిస్తామన్నారు. మందకృష్ణ మాదిగ జాతిని ఆత్మగౌరవం నుంచి బానిసత్వం వైపు నడపాలి అనుకుంటున్నాడని విమర్శించారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే 2014లో మహాజన సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేసుంటే ఎవరి కాళ్ల పట్టుకోకుండానే ఎస్సీ వర్గీకణ వచ్చేదన్నారు. కోర్ కమిటీ సభ్యులు గణేష్, వరలక్ష్మి, వెంకటేష్, ప్రవీణ్, వెంకట్, రమేష్, శ్యామ్‌రావు, అశోక్, శివ తదితరులున్నారు.

ఘనంగా కర్పూరి ఠాగూర్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఎం.వీ.చెన్నారావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారతరత్న, బిహార్ మాజీ సీఎం కర్పూరి ఠాగూర్ వర్ధంతి సభను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ వాయిద్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షులు ఎల్.వీ.చెన్నారావు మాట్లాడుతూ.. సీఎంగా బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మండల కమిషనర్ ఓబీసీ రిజర్వేషన్ సిఫారస్సు చేయకముందే బిహార్‌లో 1978లో ఓబీసీలు, స్త్రీలకు రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా జరిగిన ఓబీసీ, ఎంబీసీ ఉద్యమాలకు కర్పూర్ ఠాగూర్ ఆద్యులన్నారు. భారత స్వాతంత్ర్యం కోసం క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని కూడా గడిపారన్నారు. ప్రొఫెసర్ బాగయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, ఎస్‌వీకే కార్యదర్శి వినయ్‌కుమార్, ఎంబీసీ రాష్ట్ర కార్యదర్శి దుర్గారావు, రాపోలు సుదర్శన్, హన్మంతరావు, నగేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌కు సత్కారం



అనిల్‌కుమార్‌యాదవ్‌ను అభినందిస్తున్న అంజియాదవ్



సన్మానిస్తున్న సేవాదళ్ నేతలు వరదరాజు, కరణం సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇటీవల రాజ్యసభ సభ్యులుగా నియమితులైన సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌ను ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనిల్‌కుమార్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా అదిష్టానం అత్యున్నత పదవి ఇవ్వడం గర్వకారణమన్నారు. నాయకులు కోనేరు పవన్, నవీన్‌కుమార్, సురేష్ తదితరులున్నారు.

ముషీరాబాద్: రాజ్యసభ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసి నామినేషన్ దాఖలు చేసిన సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నాయకులు ఘనంగా సన్మానించారు. సికింద్రాబాద్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు వరదరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కరణం సురేష్, నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు ఫిరంగి ప్రసాద్, కాంగ్రెస్‌నేతలు రామకృష్ణ, కృష్ణ తదితరులున్నారు.

ఘనంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పలుచోట్ల కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులు, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ.. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. – అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ల బృందం



బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్



పారిశుద్ధ్య కార్మికులకు మిఠాయిలు అందిస్తున్న గోల్నాక కార్పొరేటర్ లావణ్య



రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి



కాచిగూడలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: నియోజవర్గంలో తాగునీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం డివిజన్‌లోని విక్టోరియాకేఫ్ నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ చౌరస్తా వరకు రూ.20.75 లక్షలతో చేపట్టిన నూతన తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ పావనితో కలిసి ఆయన ప్రారంభించారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠాజైసింహ, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎం.రాకేష్‌కుమార్, రత్నసాయిచంద్ తదితరులున్నారు.

సమగ్ర కులగణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నాం

బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సమగ్ర కులగణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని రాజకీయ పార్టీలు ఈ తీర్మాణానికి మద్దతు తెలపడం హర్షనీయమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసుసురేష్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో జరిగిన మేధావుల ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణన బిల్లుకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మాణం అస్పష్టంగా ఉందని తీర్మానం కాకుండా దీనికి జూడిషనల్ కమిషన్ లేదా ప్రత్యేకమైన బిల్లు ప్రవేశపెట్టి ఉంటే తెలంగాణ ప్రజానీకానికి మరింత ఉపయోగపడేదని హితవు పలికారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. నేటికి బీసీలపై వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో బీసీలకు నాలుగు మంత్రి పదవులు దక్కితే ఈ ప్రభుత్వంలో ఇద్దరికే మంత్రి పదవులు దక్కడం బాధాకరమన్నారు. 2016లో కర్ణాటకలో 120 కోట్లతో నిర్వహించిన కుల గణన ఫలితాలు నేటికి బయటకు రాకపోవడంతో అక్కడి ప్రజలు నిరాశతో ఉన్నారన్నారు. సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, బీసీ రాజ్యాధికార సమితి ముఖ్య సలహాదారులు వి.జి.ఆర్.నారగోని, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ, మహిళా అధ్యక్షురాలు బోనం ఉర్మిల, గ్రేటర్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, గోషిక స్వప్న, దుర్గేష్ యాదవ్, బాలకృష్ణ తదితరులున్నారు.

ప్రయోగాలు లేకుండా ఫలితాలు రావు

ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



బాలోత్సవంలో చిన్నారుల నృత్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏ ప్రయోగాలు లేకుండా ఫలితాలు రావని ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రజాపాటకు నృత్య నిరాజనం పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది కళాకారులు 36 ప్రజా పాటలకు, దేశభక్తి గీతాలకు లయబద్ధంగా నృత్యం చేసి అలరించారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ కళారూపాలు ప్రజలకు చేరువైనప్పుడే వారిలో చైతన్యం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కమిటి అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.సోమయ్య పాల్గొన్నారు.

రూ. 24 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అభివృద్ధి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడ, జమాల్‌బస్తీలో శనివారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే రూ. 24 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ డీఈ రఘు, ఏఈ సబిత, జలమండలి ఏఈ భావన, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీషఓంప్రకాష్ యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కృష్ణాగౌడ్, సునీల్ బిడ్లాన్, ప్రతిభ, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, హజారి బాబు, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చారిత్రాత్మకం



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

అంబర్‌పేట్: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీల కోసం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కొనియాడారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన నిర్వహించాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించడాన్ని పురస్కరించుకుని శనివారం అంబర్‌పేట మహాత్మా జ్యోతిరావు పూలే చౌరస్తాలో సంబరాలు నిర్వహించుకున్నారు. జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కులగణన చేపట్టాలని ఎన్నో పోరాటాలు చేశామని, తమ పోరాటాలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కులాల లెక్కలు తేలితే హక్కుల వాటా తేలుతుందన్నారు. దీనిపై రెండు మూడు రోజుల్లో బీసీ విద్యావేత్తలు, మేధావులతో విధివిధానాల కోసం సదస్సు నిర్వహిస్తామన్నారు. కులగణనకు రాష్ట్రంలో అన్ని రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు సహకరించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బాడేసాబ్, బీసీ సంఘాల నాయకులు మణిమంజారి, మహేశ్‌యాదవ్, సదానందం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ డీఈపై కార్పొరేటర్ ఆగ్రహం

కాచిగూడ: కాచిగూడ చౌరస్తాలో ఉన్న స్వాతంత్ర్య సరమయోధుడు వీరసావర్కర్ విగ్రహం ఫెన్సింగ్‌ను కొంతవరకు జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. ప్రధాని పర్యటన నుంచి వీరసావర్కర్ విగ్రహం వద్ద ప్రహరీ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహం వద్ద ఫెన్సింగ్ లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు.